RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి : 3, సంచిక : 256

గురువారం
సెప్టెంబర్ 11, 2025

పేజీలు : 4
వెల : రూ.3-00



ఆత్మహత్యల నివారణపై అవగాహన

2లో..

## చందా ఇవ్వలేదని కుల బహిష్కరణ..!



**వేద న్యూస్,జగిత్యాల రూరల్:**

జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామంలో అనాగరిక ఘటన చోటుచేసుకుంది. ఇటీవల నిర్వహించిన వినాయక నవరాత్రుల సందర్భంగా గణపతి చందా ఇవ్వలేదని గ్రామానికి చెందిన నాలుగు కుటుంబాలను కులం నుండి బహిష్కరించారు. అంతటితో ఆగకుండా ఆ కుటుంబాలతో ఎవరు మాట్లాడకూడదని ఊర్లో డప్పు చప్పుల్లతో దండోరా వేయించారు. వెలివేసిన కుటుంబాలతో ఎవరైనా మాట్లాడితే 25 వేల జరిమానా విధిస్తామని హుకుం జారీ చేసినట్లు బాధితులు తెలిపారు. ఆ కుటుంబాలతో కులానికి చెందిన ఎవరైనా మాట్లాడినట్లు సమాచారం అందించిన వారికి 5 వేల నజరానా కూడా ప్రకటించేశారు. భక్తితో దేవుడికి కొబ్బరికాయ కొట్టేందుకు వస్తే 1,116 ఇచ్చిన తర్వాతనే కొట్టాలని తేల్చి చెప్పడంతో అది కాస్త కులబహిష్కరణకు దారి తీసినట్లు తెలుస్తుంది. కంప్యూటర్ యుగంలో కూడా కులం పేరుతో కట్టుబాట్లు, బహిష్కరణల పేరుతో నిబంధనలు పెడితే బాధిత కుటుంబాలకు భవిష్యత్తు ఎక్కడికి దారితీస్తుందన్న ప్రశ్న జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటన పై కన్నీటి పర్యంతం అవుతున్న బాధిత కుటుంబాలు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లుగా తెలుస్తుంది. మరోవైపు కులం కట్టుబాట్ల పేరుతో ఇష్టానుసారం వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్లు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.



# 'రక్షణ' భూములు బదలాయించండి


**- అక్కడ గాంధీ సర్కిల్ ఆఫ్ యూనిటీ నిర్మిస్తాం - కేంద్ర రక్షణ మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి**

**వేద న్యూస్, డెస్క్:**


తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో వారి నివాసంలో సమావేశమయ్యారు. మూసీ, ఈసా నదుల సంగమ స్థలిలో గాంధీ సరోవర్ ప్రాజెక్టు చేపట్టనున్న ప్రణాళికపై ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి సమగ్రంగా వివరించారు. ఈ రెండు నదుల సంగమ స్థలంలో గాంధీ సర్కిల్ ఆఫ్ యూనిటీ నిర్మాణం చేపడతామని, ఇందుకు అక్కడ ఉన్న 98.20 ఎకరాల రక్షణ శాఖ భూములు రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని కోరారు. జాతీయ సమైక్యత, గాంధేయ విలువలకు సంకేతంగా ప్రతిష్టాత్మకంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టులో గాంధీ సిద్ధాంతాలను ప్రచారం చేసే నాలెడ్జ్ హబ్, ధ్యాన గ్రామం, చేనేత ప్రచార కేంద్రం, ప్రజా వినోద స్థలాలు, ల్యాండ్ స్కేప్, ఘాట్లు, శాంతి విగ్రహం మ్యూజియం నిర్మిస్తామని వివరించారు. రాజ్‌నాథ్‌తో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు ఎంపీలు పొరిక బలరాం నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, కడియం కావ్య, మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఇవి నరసింహారెడ్డి, కేంద్ర ప్రాజెక్టులు, పథకాల సమన్వయకర్త డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుతో ఎలక్ట్రానిక్ వస్తువులు ధ్వంసం

**వేద న్యూస్,వేములవాడ:**







వేములవాడ పట్టణంలోని భగవంతరావు నగర్‌లో అకస్మాత్తుగా చిన్నపాటి వర్షం తో పిడుగుపాటు చోటుచేసుకుంది. ఆకస్మికంగా పిడుగు ఒక వ్యక్తి ఇంటిపై పడటంతో ఇంట్లో ఉన్న టెలివిజన్, ఫ్రిజ్, ఫ్యాన్స్ వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు దెబ్బతిన్నాయి. ఇంటి పైభాగంలోని గోడకు పిడుగు తగలడంతో కొంత భాగం కూలిపోయింది. ఈ ఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అయితే, ఇంట్లో ఉన్న వారికి ఎలాంటి ప్రాణాపాయం జరగకపోవడం ఊరట కలిగించింది. వర్షాకాలంలో పిడుగుపాట్లు ఎక్కువగా సంభవించే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## మంత్రి కొండా సురేఖని కలిసిన దసరా ఉత్సవ కమిటీ

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఉర్సు రంగలీలా మైదానంలో జరిగే సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని రాష్ట్ర మంత్రి కొండా సురేఖను దసరా ఉత్సవ కమిటీ కోరారు. బుధవారం ఓ సిటీలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దసరా ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు గోపాల నవీన్ రాజ్ మంత్రి కొండా సురేఖని ఘనంగా సత్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిర్వహించే లాగానే ఈ ఏడాది కూడా అత్యంత వైభవంగా సద్దుల బతకమ్మ, రావణ వధ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

**- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ**

**వేద న్యూస్,వరంగల్:**




ప్రతి పేద ఇంటికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని విడతలవారీగా అర్హులందరికీ ఇండ్లు ఇస్తామని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ హామీనిచ్చారు. బుధవారం వరంగల్ పర్యటనలో ఉన్న మంత్రి సురేఖ వరంగల్ ఈస్ట్ లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు సాంక్షన్ పత్రాలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారుడికి ఐదు లక్షలు రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని వివరించారు. గత ఎన్నికలకు ముందు ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు నూతన హామీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. పేదవారి ఆశయాన్ని నెరవేర్చడం కోసం రాష్ట్రం ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను చేపడుతు ఒదన్నారు. ఎన్నికల ముందు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేరుస్తామని మంత్రి సురేఖ తెలిపారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అత్యంత నిరుపేద అర్హులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా ప్రభుత్వం పారదర్శకంగా పోర్టల్ ద్వారా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మంజూరి పత్రాలు స్వీకరించిన లబ్ధిదారులు త్వరగా ఇళ్ళను నిర్మించుకోవాలని కోరారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకే సబ్సిడీపై గ్యాస్ సిలిండర్, 200 యూనిట్స్ వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పేదల సమస్యలు మానవత దృక్పథంతో అధికారులు పరిశీలించి త్వరితంగా పరిష్కరించాలన్నారు. నిరుపేదలు గుడిసెలలో, అద్దెకు ఉంటూ సుదీర్ఘ కాలంగా ఇండ్ల నిర్మాణాలకు వేచి చూస్తున్నారన్నారు. అటువంటి పేద వారి కలలను రాష్ట్ర ప్రభుత్వం నిజం చేస్తున్నదని అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాటకు కట్టుబడి మహిళల కోసం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు తీసుకువచ్చారని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కార్యక్రమం నిరంతరమని, ఇల్లు రాని నిరుపేదలు నిరుత్సాహపడవలసిన అవసరం లేదని, అర్హులైన ప్రతినిరుపేదకు తప్పనిసరిగా ఇల్లు మంజూరు చేస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమం జోడొద్దుల్లా ముందుకు తీసుకెళుతున్నారని మంత్రి సురేఖ తెలిపారు.

# స్తంభించిన వస్త్రోత్పత్తి

**- పవర్ లూమ్స్ పై మళ్లీ విజిలెన్స్ దాడులు - ఆందోళనలో నేతకార్మికులు..!**

**వేద న్యూస్, గంగాధర :**



కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తి గ్రామంలోని పవర్ లూమ్స్‌పై బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏడి అనిత ఆధ్వర్యంలో చెన్నైకి చెందిన చేనేత జౌళి శాఖ విజిలెన్స్ అధికారులు దాడులు చేపట్టారు. పాత జీవోలను ఆధారంగా తీసుకుని గ్రామంలోని పలు సాంచలపై నడుస్తున్న కలర్ చీరలను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. మిట్టపెల్లి వెంకటేశ్, దూస వెంకటేశం అనే నేతకార్మికులపై కేసులు నమోదు చేసి సాంచల్లో నడుస్తున్న చీరలను కోసేశారు. అధికారులు వీధివీధి తిరుగుతూ సాంచలను పరిశీలించడంతో నేతకార్మికులు భయాందోళనకు గురయ్యారు.

**- ఉపాధి కోల్పోతున్న నేతకార్మికులు**

రెక్కాడితేనే డొక్కానన్న పరిస్థితిలో ఉన్న నేతకార్మికులకు ప్రభుత్వం ఇటీవల స్వశక్తి మహిళా సంఘం చీరల ఆర్డర్లు ఇవ్వడంతో కొంత ఉపాధి లభించింది. అయితే, అదే సమయంలో విజిలెన్స్ దాడులు జరగడంతో పవర్ లూమ్స్ పనులు నిలిచిపోయాయి. "పనులు లేక ఇబ్బంది పడుతున్న మా కుటుంబాలపై కక్ష సాధింపుతో కేసులు పెడుతున్నారు" అని నేతకార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. స్వశక్తి చీరల పనులు మొదలైనప్పటికీ, కలర్ చీరలు, తయారు చేయడం నేరంగా పరిగణించి అధికారులు దాడులు చేయడం అన్యాయమని ఆరోపించారు.

**- ప్రతి ఏడాది భయం**

ప్రతి యేటా చెన్నై చేనేత జౌళి శాఖ విజిలెన్స్ అధికారులు వచ్చి దాడులు చేయడం వల్ల భయాందోళన నెలకొంటోందని వ్యాపారులు, కార్మికులు అన్నారు. బతుకమ్మ చీరల ఆర్డర్లు ముగిసిన తర్వాత ఏడాదిన్నర పాటు ఉపాధి లేక ఇబ్బందులు ఎదుర్కొన్న తమకు ఇప్పుడు లభిస్తున్న స్వశక్తి చీరల ఆర్డర్లను కూడా నిలిపేస్తే తమ జీవనం సంకటంలో పడుతుందని నేతకార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఆత్మహత్య సమస్యలకు పరిష్కారం కాదు




**వేద న్యూస్,వరంగల్:**

ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ఏవివి కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం కొడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమానికి సైకాలజిస్ట్ మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ భుజేందర్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నేటి యువత లక్ష్యం వైపు పయనిస్తూ కొన్ని అనివార్య కారణాలవల్ల లక్ష్యాన్ని సాధించలేనప్పుడు ఆత్మహత్యలే శరణ్యమని అనుకొని ఆత్మహత్య చేసుకుంటున్నారు ఇది చాలా దారుణం ఆత్మహత్యలు సమస్యకు ఎప్పుడు పరిష్కారం కాదని ఇంకా తనపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులకు, ఇతరులకు హాని కలుగుతుందని దయచేసి ఎవ్వరు ఆత్మహత్య చేసుకోవద్దని లక్ష్యం నెరవేరు నప్పుడు ఎప్పుడూ ప్లాన్ "బి "సిద్ధంగా ఉండాలని ఇంకా ఎన్నో ప్రత్నామ్యాయ అవకాశాలు మనకు ఈ సమాజం అందిస్తుందని దీని గ్రయించి జీవితంపై ఆశావాదం దృక్పథంతో ముందుకు సాగాలని దీనికి కుటుంబ సభ్యులు, ఫ్రెండ్స్,ఆత్మీయుల సహాయ సహకారాలు ఎంతో అవసరమని అన్నారు .అలాగే ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొడిమాల శ్రీనివాసరావు మాట్లాడుతూ నేటి యువత చాలా సున్నిత మనస్కులు ఉంటున్నారని చిన్న చిన్న సమస్యలను ఎదుర్కొనలేక ఆత్మహత్యలకు పాడుతున్నారని ప్రతి సంవత్సరము ఇండియాలో లక్షకు పైగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఇందులో అధిక భాగం యువతే ఉన్నారని ఇది చాలా ఆందోళనకరమైన విషమని తెలియజెశారు. విద్యార్థులను సంఘటితపరిచి ఆశావాద దృక్పథం పై అవగాహన కార్యక్రమాలు, జీవితం యొక్క గొప్పతనాన్ని తెలియజేస్తూ ప్రముఖ మానసికవేత్తలతోని శిక్షణ ఇప్పించి తద్వారా వాలంటీర్లు తమ యొక్క మిత్రులకు, పెద్దలకు అందరికీ అవగాహన కలిగించాలని వాలంటీలను కోరారు. ఈ కార్యక్రమంలో సైకాలజిస్ట్ డాక్టర్ అనిత ,అధ్యాపకురాలు దేశ బోయిన స్వప్న , డాక్టర్ శ్రీధర్, జి శ్రీనివాస్ వాలంటీర్లు చెయాంక్ ,సిద్దు, చిరంజీవి, రాజ్ కుమార్, సాత్విక్, నీరజ్, దేవి శ్రీ ప్రసాద్ ,సాయి హర్షిత్, గణేష్, మన్విత, నవ్య, హర్ష ,ప్రవళిక, స్రవంతి, సాత్విక తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మహత్యల నివారణపై అవగాహన

**వేద న్యూస్, హన్మకొండ:**

ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో భీమారం అరుణోదయ డిగ్రీ కళాశాల, కేజీబీవీ లో ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తరుపున డాక్టర్ ప్రహసిత్ సైకియాట్రిస్ట్ మాట్లాడారు. ప్రపంచంలో జరిగే ఆత్మహత్యలలో ఎక్కువగా యువతి యువకులే ఉంటున్నారు. చావడమే కారణం కాకుండా బ్రతికి సాధించడం అనేది గొప్ప అన్నారు. యువత ఆత్మహత్య ఆలోచన వచ్చినప్పుడు మీ స్నేహితులకు గాని, టీచర్స్ గాని, చెప్పుకొని మీ యొక్క సమస్యను పరిష్కరించుకోవచ్చు అన్నారు. అలాగే యువత ఎక్కువగా చదువుపై శ్రద్ధ పెడితే ఎలాంటి ఆత్మహత్య ఆలోచనలు రావని సూచించారు. ప్రతి సమస్యకి పరిష్కారం ఉంటుంది అని అన్నారు. ఆత్మహత్య ఆలోచనలను నివారించడం సామాన్య ప్రజానీకం లో ఆత్మహత్య పట్ల అవగాహన పెంపొందించడం చాలా ముఖ్యము అని అన్నారు. అలాగే ఇక మానసిక వ్యాధులను మొదటి దశలోనే గుర్తించి తగు చికిత్స అందించాలి అన్నారు. ఆత్మహత్య ఆలోచనలు కలిగినప్పుడు మీ దగ్గరలోని వైద్యులను సంప్రదించి సరైన సూచనలు తీసుకోవాలని అన్నారు. ఎవరికి అయినా మానసిక సమస్యలు, ఆర్థికపరమైన సమస్యలు, కోపం, చిరాకు, మత్తు పదార్థాలకు బానిసలై ఉన్నవారు 14416 టెలి మానస్ కాల్ చేసి సమస్యను పరిష్కరించుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో పల్లె దవఖాన డాక్టర్ మానస విద్యార్థులను ఉద్దేశించి శారీరకంగా,



మానసికంగా దృఢంగా ఉంటే ఎలాంటి ఆత్మహత్య ఆలోచనలు రావు అన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్వప్న, అరుణోదయ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రాజు సార్, సోషల్ వర్కర్ నరేష్, ఏఎన్ఎం స్వరూపరాణి, ఆశా కార్యకర్తలు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తిదాయకం



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

భూమికోసం,భుక్తికోసం,వెట్టిచాకిరి విముక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తిదాయకం అని మాజీ ఎమెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాంది పలికిన ఐలమ్మ బహుజన ఆత్మగౌరవానికి ప్రతీక అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు,బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, మాజీ ఏఎంసి చైర్మన్ చింతపల్లి వేణురావు,సెస్ డైరెక్టర్ మల్లుగారి రవిందర్ రెడ్డి,మాజీ రైతుబంధు సమితి అధ్యక్షుడు చెరుకుపల్లి రాజిరెడ్డి, పాక్స్ వైస్ చైర్మన్ గౌడుగు తిరుపతి,వల్లంపట్ల మాజీ సర్పంచ్ కేతిరెడ్డి అనసూయ వెంకటనర్సింహారెడ్డి, మాజీ ఉపసర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షుడు ఎండి.సాదుల్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎండి.సలీం, పట్నం శ్రీనివాస్,సంతోష్ రెడ్డి,కొట్టే వెంకన్న,దోంతుల శంకర్ లింగం, కూనబోయిన రఘు, ఒరుపుల రాములు,సదువాల సతీష్,దమ్మని మధు తదితరులు పాల్గొన్నారు.

# కేయూలో డేటా బేస్ శిక్షణ

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**



కాకతీయ విశ్వవిద్యాలయంలోని సెంట్రల్ లైబ్రరీ ఆధ్వర్యంలో ఐఈఈఈ డేటాబేస్‌పై శిక్షణ కార్యక్రమం కాకతీయ విశ్వవిద్యాలయం సెంట్రల్ లైబ్రరీ ప్రముఖ అంతర్జాతీయ సాంకేతిక సంస్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీర్స్ ఐఈఈఈ వారి డేటాబేస్ ఉపయోగంపై శిక్షణా నిర్వహించారు. ఈ కార్యక్రమం విశ్వవిద్యాలయ గణితశాస్త్ర విభాగంలోని సెమినార్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా, కేంద్ర గ్రంథాలయ మెంబర్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ బి.రాధికారాణి మాట్లాడుతూ ఈ డిజిటల్ శిక్షణ పరిశోధకులు, అధ్యాపకులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఐఈఈఈ వారి వెబ్‌సైట్

[ieeexplore.ieee.org](https://iee-explore.ieee.org) లో ఉన్న దాదాపు 6 మిలియన్ల శాస్త్రీయ పత్రాలు, జర్నల్స్, కాన్ఫరెన్స్ ప్రొసీడింగ్స్ లాంటి విలువైన సమాచారం పరిశోధన అవసరాలకు అనుగుణంగా లభ్యమవుతుందని వివరించారు. ఈ శిక్షణలో పరిశోధనలో నూతన అంశాలను ఎలా పరిశీలించాలో నాలెడ్జ్ షేరింగ్, సహకార అవకాశాలు ఎలా పొందాలో ముఖ్యాంశాలపై అవగాహన ఎలా పెంపొందించుకోవాలో వివరించారు. ప్రత్యేకంగా ఐఈఈఈ శిక్షకుడు శ్రీనివాస్ ఈ విషయాలపై సమగ్రంగా అవగాహన ఇచ్చారు. ఈశిక్షణలో సుమారు 100 మంది పాల్గొని ఐఈఈఈ డేటాబేస్‌ను తమ పరిశోధనలకు ఎలా వినియోగించుకోవాలో వివరించారు. కేయూ వెబ్‌సైట్‌లో ఓఎన్ఓఎస్ డేటాబేస్ ను ఎలా యాక్సెస్ చేయాలో కూడా డా.బి. రాధికారాణి వివరించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయంలోని వివిధ విభాగాల నుండి పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఆచార్య పి. మల్లారెడ్డి, ఆచార్య జే. కృష్ణవేణి, డాక్టర్ కే. భిక్షాలు, డాక్టర్ ఆర్.భారవి శర్మ, డాక్టర్ ఎల్.పి. రాజ్‌కుమార్, డాక్టర్ సుమలత, డాక్టర్ రాధిక, డాక్టర్ షాహేదా, డాక్టర్ ఇజాక్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


# వినతి పత్రం అందజేత



**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం రత్నంపేట గ్రామంలో సిఐటియు ఆధ్వర్యంలో బీడీ,సిగార్, వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు మహిళా బీడీ కార్మికులందరికీ మేము అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలలో భాగంగా మొట్టమొదలు ప్రతి మహిళా బీడీ కార్మికురాలికి 4000 రూపాయలు పెన్షన్ బ్యాంకు ద్వారా జమ చేస్తామని వాగ్దానం ఇచ్చింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చి దాదాపు 20, నెలలు పూర్తి కావస్తున్న కూడా మహిళా బీడీ కార్మికులను పట్టించుకున్న పరిస్థితుల్లో ప్రభుత్వం లేకుండా పోయింది. ఇప్పటివరకు కూడా 4000 ,రూపాయల పెన్షన్ అమలు చేసిన దాఖలాలు లేవు. అలాగే మహిళా బీడీ కార్మికులు అర్హులైన కార్మికులను గుర్తించి ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని చెప్పి విజ్ఞప్తి చేయడం జరుగుతుంది. కావున మీరు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సిఐటియు, బీడీ, సిగార్, వర్కర్స్ యూనియన్ తరపున డిమాండ్ చేశారు. లేనియెడల మహిళా బీడీ కార్మికులను ఏకం చేసి రేపటి రోజున,పెద్ద ఎత్తున జిల్లా కలెక్టర్, కార్యాలయం ముందు ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని ప్రభుత్వానికి మీ ద్వారా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల సిఐటియు కన్వీనర్ గురిజాల శ్రీధర్, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు రామంచ అశోక్, బీడీ రంగం యూనియన్ జిల్లా కమిటీ సభ్యురాలు గురజాల మమత,రత్నంపేట మహిళా బీడీ కార్మికులు, గోండ జ్యోతి, గుండ జ్యోతి, ఏడికి జ్యోతి, అత్తేన జమున, గర్వందుల జ్యోతి, గొండ నిర్మల, ఇటిక్యాల నిర్మల, బూత్కూరు రేణుక,అత్తేనా సత్యలక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

# మహిళా చైతన్యానికి స్ఫూర్తి



**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

నేటి యువతరానికి స్ఫూర్తి మహిళా వీర వనిత, వీరనారి చిట్యాల(చాకలి) ఐలమ్మ అని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం తెలిపారు. విశ్వవిద్యాలయ బి.సి. సెల్ సంచాలకులు డాక్టర్ బి.సతీష్ అధ్యక్షతన కేయూ బి. సి. సెల్ కార్యాలయంలో నిర్వహించిన "వీరనారి చిట్యాల (చాకలి) ఐలమ్మ 40వ వర్ధంతి కార్యక్రమంలో ముఖ్య అతిదిగా పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించి, విద్యార్థులు, ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించారు, ఆమె ధైర్య సాహసాలను, పట్టుదలను కొనియాడారు, ప్రతికూల పరిస్థితి లో కుడా ఎలా నిలబడిందొ వివరించారు. ఈ కార్యక్రమం లో పరిక్షల నియంత్రణ అధికారి ఆచార్య కట్ల రాజేందర్, మహిళా ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కే. భిక్షాలు, ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్రా రాజు, వృక్ష శాస్త్రం విభాగాధిపతి డాక్టర్ బి.లలిత కుమారి, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగ అధిపతి డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు, విద్యార్థిని విద్యార్థులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి

**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం అనంతపల్లి గ్రామంలో చాకలి ఐలమ్మ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారిణి వీరవనిత,తొలి భూపోరాటానికి నాంది పలికిన వీరమాత, సామాజిక ఆధునిక పరిణామానికి నాంది పలికిన స్త్రీ ధైర్యశాలి వీరనారి చాకలి ఐలమ్మ, 40వ వర్ధంతి కార్యక్రమం బుధవారం అనంతపల్లి రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో కులాలకు అతీతంగా ప్రతి ఒక్కరు పాల్గొని చాకలి ఐలమ్మ,కి ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమం లో సంఘం వైస్ ప్రెసిడెంట్ అల్వాల చెల్లయ్య, వెంకటేష్,రాజయ్య, భూమయ్య, రాములు,తిరుపతి, పాల్గొన్నారు.



# ఓటర్ల తుది జాబితా ప్రదర్శన

**వేద న్యూస్,బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం స్థానిక సంస్థల 2వ సాధారణ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్‌లో భాగంగా బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో తుది ఓటర్ల జాబితా మరియు పోలింగ్ స్టేషన్ల వివరాలను ప్రదర్శించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి.జయశీల,మాట్లాడుతూ మండల పరిధిలోని 11 ఎంపీటీసీ/జడ్పీటీసీ, నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు పూర్తి చేసిన తరువాత తుది ప్రతిని (ఫైనల్ పబ్లికేషన్) నోటీస్ బోర్డుపై ఉంచినట్లు తెలిపారు.

## బదిలీపై వెళ్తున్న క్యాషియర్‌కు
# ఘన వీడుకోలు



**వేద న్యూస్,వీర్నపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ లో ఐదు సంవత్సరాలు పనిచేసిన క్యాషియర్ శ్రావణ్ జై కిసాన్ ఉద్యోగ బదిలీలో భాగంగా వీర్నపల్లి నుండి రామారెడ్డి తెలంగాణ గ్రామీణ బ్యాంకు కు ఆఫీసర్ గా బదిలీ కావడం జరిగింది. బదిలీ అయిన క్యాషియర్ కు తోటి సహా ఉద్యోగులు సాల్వ కప్పి ఘనంగా వీడుకోలు చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ మధం సంతోష్, ఫీల్డ్ ఆఫీసర్ సురేష్,గోల్డ్ అప్రైజర్ అశోక్ అటెండర్ ఎస్ డి షకీల్ పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులను
# పరిశీలించిన ఎంపీడీఓ



**వేద న్యూస్,గంగాధర:**

మధురానగర్ బీసీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను బుధవారం ఎంపీడీవో దమ్మని రాము పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత సిబ్బందికి తగిన సూచనలు చేస్తూ, పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా క్యూరింగ్ పనులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.




# పద్ధతి మార్చుకోకపోతే చర్యలు




- బెల్టు షాపుల నిర్వాహకులకు పోలీసుల హెచ్చరిక
- "వేద న్యూస్" కథనానికి స్పందన
- స్వయంగా రంగంలోకి దిగిన ఏఎస్పి

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్:**

జులై 18, 2025 న "వేద న్యూస్" తెలుగు దినపత్రిక ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనానికి స్పందన వచ్చింది. "ఏ జే ఏబెల్ట్ అడ్డా!?" శీర్షికన వార్తా కథనం ప్రచురితమయింది. మిల్స్ కాలని పరిధిలో ఉన్న పలు ప్రాంతాలకు సంబంధించిన బెల్ట్ షాప్ ల గురించి ఆరా తీసేందుకు స్వయంగా ఏఎస్పి శుభం ప్రకాష్,మిల్స్ కాలనీ పోలీసులు రంగంలోకి దిగారు. తెల్ల వార్లు బెల్ట్ షాప్ లు కొనసాగుతూ.. నిత్యం గొడవలకు కారణం అవుతున్న బెల్ట్ షాపుల నిర్వాహకులకు, ప్రజలకు ఏ ఎస్ పి శుభం ప్రకాష్ కౌన్సెలింగ్ ఇచ్చారు. పద్ధతి మార్చుకోకపోతే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## రాష్ట్రస్థాయి టీఎల్ఎంకు
# ఎంపికైన మల్టీపర్పస్ గ్రిడ్



**వేద న్యూస్, దామెర :**

దామెర మండలం తక్కళ్లపాడు యూపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు వల్లంపట్ల శ్యాంసుందర్ తయారుచేసిన మల్టీ పర్పస్ గ్రిడ్ రాష్ట్రస్థాయి టీఎల్ఎంకు ఎంపికైంది. అట్టపెట్టెలను ఉపయోగించి లోకాస్ట్, నోకాస్ట్ మెటీరియల్‌తో అత్యంత అద్భుతంగా తయారు చేయడంతో రాష్ట్రస్థాయికి ఈ ప్రయోగం ఎంపికైంది. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు శ్యాంసుందర్ మాట్లాడుతూ ప్రాథమిక తరగతిలో విద్యార్థులు అభ్యసన సామర్థ్యాలు సాధించడం కోసం ఈ ఉపకరణం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మల్టీ గ్రేడ్ టీచింగ్, మల్టీ లెవెల్ టీచింగ్తో విద్యార్థులు ఈ టిఎల్ఎంతో స్వయంగా యాక్టివిటీస్ చేయడం ద్వారా ఆంగ్ల భాషలోని అనేక కాన్సెప్ట్స్ సులభంగా అర్థం చేసుకోవచ్చన్నారు. ఆల్ఫాబెట్, వొకాబులరీ, సంటెన్స్ కన్స్ట్రక్షన్, గ్రామర్ మొదల్కైన అంశాలు లర్నింగ్ బై డూయింగ్ ద్వారా పిల్లల్లో ఆంగ్లభాష సామర్థ్యం పెరుగుతుందన్నారు. స్టేట్ లెవెల్‌కి నాలుగు సబ్జెక్టులలో ఎంపిక కాబడిన ఆరు ఈవెంట్లలో వల్లంపట్ల శ్యాంసుందర్‌కు ఇంగ్లీష్ విభాగంలో సెలెక్ట్ కావడం జరిగింది. ఈసందర్భంగా పలువురు ఉపాధ్యాయులు శ్యాంసుందర్‌కు అభినందనలు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో కూడా అత్యుత్తమంగా ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

# ఎంపీడీవో కార్యాలయంలో ఓటరు జాబితా ప్రదర్శన



**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**

ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీటీసి స్థానాల వారీగా తుది ఓటరు జాబితా పోలింగ్ కేంద్రాలను గోడలపై ప్రదర్శించారు. ఓటరు జాబితాపై ఇటీవల జిల్లా, మండల స్థాయిలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో అభ్యంతరాల పరిష్కారం కోసం సమావేశం నిర్వహించారు. అయితే 10న అన్ని పోలింగ్ కేంద్రాల్లో తుది ఫోటో ఓటరు జాబితా ప్రదర్శించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన నేపథ్యంలో ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో సలీం అధ్వర్యంలో ముసాయిదా ఓటరు జాబితాను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సిటీ కాలేజీలో గణాంక శాస్త్ర దినోత్సవం




**వేద న్యూస్, హైదరాబాద్:**

గణితశాస్త్రం, స్టాటిస్టిక్స్ విభాగాలు ప్రొఫెసర్ సి. ఆర్. రావు గారి 105వ జయంతిని ఘనంగా నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డా.ఎం. జగన్ మోహన్ రావు, వైస్ ప్రిన్సిపాల్ డా.పి. శాంతి, స్టాటిస్టిక్స్ విభాగం అధ్యక్షులు డా.కె.శారద, గణితశాస్త్ర విభాగం అధ్యక్షులు డా.సి. శ్రీనివాస రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్య అతిథి డా. ఎం.జగన్ మోహన్ రావు గణాంకశాస్త్ర వ్యావహారిక ప్రాముఖ్యతను వివరించడమే కాక, ప్రొఫెసర్ సి. ఆర్. రావుతో తన వ్యక్తిగత అనుభవాలను కూడా పంచుకున్నారు. ప్రొఫెసర్ రావు ఆధునిక గణాంకశాస్త్రంలో చేసిన అపారమైన కృషి గురించి వివరించారు.ఈ సందర్భంగా విభాగం నిర్వహించిన పోటీలలో విజేతలకు ముఖ్య అతిథి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.

# ఇరవై ఐదు టన్నుల యూరియా దిగుమతి

**వేద న్యూస్, శాయంపేట:**



శాయంపేట గ్రామంలోని సాయి ఫెర్టిలైజర్స్ లో పదిహేను టన్నులు ,గట్ల కనపర్తి లో గల శ్రీ వెంకటేశ్వర ఫెర్టిలైజర్స్ లో పది టన్నులు యూరియా దిగుమతి చేసినట్లు మండల వ్యవసాయ అధికారి గంగాజమున తెలిపారు.డిడి నంబర్ వచ్చిన వెంటనే పంపిణీ చేయడం జరుగుతుంది అని తెలిపారు. ఉదయం ప్రగతి సింగారం లో గల ఓ. డి. సి.ఎం ఎస్ కు పది టన్నులు ,జోగంపల్లి లో గల ఓ డి సి ఎం ఎస్ కు పది టన్నుల యూరియా రావడం జరుగుతుంది రైతులు కంగారు పడవలసిన అవసరం లేద అని అన్నారు.జోగంపల్లి లో గల ఒడిసిఎంఎస్ నుండి జోగంపల్లి , గోవిందా పూర్ రైతులకు పంపిణీ చేయడం జరుగుతుంది ఇక మిగతా సెంటర్లలో ఉన్న యూరియాను అవసరం ఉన్న రైతులు తీసుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి తెలిపారు.

# బీఆర్ఎస్ దోచుకున్న సొమ్మునంతా కక్కిస్తాం...

**వేద న్యూస్ డెస్క్ :**

కాళేశ్వరం ప్రాజెక్టు, ఈ- కారు రేస్, ధరణిలో దోచుకున్న సొమ్మునంతా కక్కిస్తాం... పేదలకు అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఇవాళ(బుధవారం) మీడియాతో మాట్లాడారు.. పక్క రాష్ట్రంలో మాజీ మంత్రులు ఎంపీ, ఎమ్మెల్యేలు అరెస్ట్ అవుతున్నారని తెలిపారు. ఇక్కడ అరెస్టులు లేవని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని పూర్తిగా ఖూనీ చేస్తుందని ఆరోపించారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలకు తాము పాల్పడమని, చట్ట ప్రకారమే అన్ని జరుగుతాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. కమిటీల ప్రకారమే నిర్ణయాలు ఉంటాయని, ఒక్కో కమిటీ రిపోర్ట్ వచ్చాక దోషులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎఫ్ - 1 రేసులో క్యాబినెట్ తీర్మానం లేకుండా విదేశీ కంపెనీలకు ఇవ్వడం.. ఎలక్టోరల్ బాండ్లు బీఆర్ఎస్ పార్టీకి వచ్చినట్టు ఆధారాలు ఉన్నప్పుడు ఎవరు ఆపినా వారి అరెస్టులు ఆగవని ఆయన స్పష్టం చేశారు.



## రూ.35 వేల ఆర్థిక
# సహాయం అందజేత

**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం రత్నంపేట గ్రామానికి చెందిన ఎదురుగట్ల నాగరాజు, ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లగా, అక్కడ బ్రెయిన్ స్ట్రోక్, పక్షవాతం, రావడంతో స్వదేశానికి తీసుకువచ్చారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేదని, ఆయన వైద్య చికిత్స కోసం ఆర్థిక సహాయం చేయాల్సిందిగా ఆయన భార్య లావణ్య, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ను వేడుకుంది. స్పందించిన జిల్లా కలెక్టర్ వైద్య చికిత్స నిమిత్తం 35 వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును నాగరాజు,భార్య లావణ్య, కు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అందజేశారు. తన భర్త వైద్య చికిత్స కోసం ఆర్థిక సహాయం అందించిన జిల్లా కలెక్టర్, కు లావణ్య, కృతజ్ఞతలు తెలిపింది.

## మందుల పిచికారిలో
# అప్రమత్తత ముఖ్యం



- ప్రముఖ నేత్ర వైద్యులు శ్రీనివాస్‌రెడ్డి

**వేద న్యూస్, జమ్మికుంట:**

పంటలో తెగుళ్లు రాకుండా, అధిక దిగుబడికి రైతులు క్రిమిసంహారక మందులను పిచికారి సమయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ చిట్టిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వరి, పత్తి సాగులో అన్నదాతలు క్రిమిసంహారక మందుల పిచికారి సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారని వెల్లడించారు. ప్రస్తుతం పంటలకు మందులు పిచికారి సమయం నేపథ్యంలో చాలా మంది రైతులు తమ వద్దకు నేత్ర వైద్యానికి వస్తున్నారని పేర్కొన్నారు. రైతులు, రైతు కూలీలు కంటి అవస్థలతో ఇబ్బందులు పడుతున్నారని, వారి కంటి అవస్థలు వర్ణనాతీత0గా ఉన్నాయని వివరించారు. వారు కార్నియల్ (కంటి నల్లపాప) తో వస్తున్నారని, వీటి వల్ల దృష్టి కోల్పోయే ప్రమాదం ఉందని వివరించారు. ఏపుగా పెరిగిన పత్తి చేనులో తల పైకెత్తి మందు స్ప్రే చేయడం వల్ల ఆ మందు కండ్లలో పడి కంటి సమస్యలు వస్తున్నాయని చెప్పారు. దానిని నివారించాలంటే తలకు హెల్మెట్ ధరించి పంట పొలాలలో క్రిమిసంహారక మందులు స్ప్రే చేయాలని సూచించారు.

# చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు

**వేద న్యూస్, చొప్పదండి :**

రామడుగు గ్రామంలో చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకల ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రజక కులస్తులు ఎడవేల్లి లచ్చయ్య, నెరేళ్ల మల్లేశం, ఎడవేల్లి రాహుల్, న్యాయవాదిఎడవేల్లి రాము, లక్ష్మణ్, సాగర్, రామడుగు గ్రామస్థులు కొత్తూరి రాజన్న, పురేళ్ల శ్రీకాంత్, ఉత్తేమ్ కనకయ్య, కడారి శ్రీనివాస్, కొలిపాక నవీన్, నాగరాజు పాల్గొన్నారు.



# ప్రాథమిక పాఠశాల సముదాయ సమావేశం

**వేద న్యూస్,మరిపెడ:**




మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని మరిపెడ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనంతరావు ఆధ్వర్యం లో మరిపెడ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆన్లైన్ మరియు ఫిసికల్ అటెండెన్స్ వెరిఫికేషన్ చేయడం జరిగింది. అలాగే ఫామేటివ్ అసెస్మెంట్ పరీక్షలపై రివ్యూ చేయడం జరిగింది. ఉపాధ్యాయు లందరూ అభిత భావంతో పనిచేసి, విద్యార్థుల యొక్క సామర్థ్యాలను పెంపొందించాలని కోరారు. ఈ కార్యక్రమం కి రిసోర్స్ పర్సన్స్ గా ఇస్రత్ బేగం మరియు శ్రీను గణితమునకు సంబంధించి ఒకటవ తరగతి నుండి 5వ తరగతి వరకు ఎలా బోధించాలో, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఉపయోగము మొదలగు విషయాలపై ఉపాధ్యా యులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. కార్యక్రమ సమావేశాన్ని సందర్శించిన మరిపెడ మండల విద్యాశాఖ అధికారిని గాదె అనితాదేవి మాట్లాడుతూ శిక్షణలో పొందిన అంశాలను దృష్టిలో పెట్టుకొని గునాత్మకమైన విద్యను విద్యార్థులకు అందజేయాలని చెప్పారు. సమయానికి ఎఫ్ ఆర్ ఎస్ అటెండెన్స్ పంపించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు రామ్మోహన్ బయగాని, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ రమేష్ మరియు మరిపెడ మండల వివిధ పాఠశాలల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మాడవీధుల నిర్మాణం పనుల పరిశీలన

**వేద న్యూస్, వరంగల్:**




వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సందర్శించి ఆలయంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మాణం చేయడుతున్నటువంటి మాడవీధుల నిర్మాణం పనుల పురోగతిని పరిశీలించారు. ఆలయానికి విచ్చేసిన కలెక్టర్ కి ఆలయ చైర్మన్ డా బి. శివసుబ్రహ్మణ్యమ్, ధర్మక ర్తలు తొనుపునూరి వీరన్న, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, బింగి సతీష్,గాండ్ల స్రవంతి ఈఓ రామల సునీతలు పూర్ణకుంభంతో మంగళవాద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజానంతరం ఆలయ మహామండపంలో భద్రకాళి శేషు ఆధ్వర్యవమున మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట కుడా అధికారులు అజిత్ రెడ్డి, భీంరావు, ఆర్.డి.ఓ రమేష్, వరంగల్ ఏ.సి.పి సత్యనారాయణ, మట్వాడ సి.ఐ కరుణాకర్, తహశీల్దార్ రవీందర్ తదితరులున్నారు. అనంతరం మాడవీధుల పురోగతిని కుడా అధికారులతో చర్చించి అమ్మవారి నవరాత్రుల నుండి భక్తులందరికీ మాడవీధిగుండా ఆలయ ప్రవేశానికి మార్గం సుగమమం చేయాలని కుడా అధికారులను కోరారు. అట్లాగే దారికి అడ్డంగా ఉన్న నిర్మాణాలను తొలగించి భక్తులకు అనుకూలంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను సుందరంగా నవరాత్రులకు రెండు రోజులకు ముందుగానే ఏర్పాటు చేయాలని కోరారు.

# పనులు అడ్డుకున్నామనడం అవాస్తం

**– కాంగ్రెస్ మండల నాయకుడు మసికే కుమారస్వామి**

**వేద న్యూస్, శాయంపేట:**



ప్రజా ప్రతినిధుల ముసుగులో ఉండి మైలారం చెరువులో మట్టిని దొంగతనం చేసిన ఒక బీఆర్ఎస్ నాయకుడు, నాణ్యత లేని డ్రైనేజీ పనులు చేసి ప్రజల సొమ్ము దోచుకున్న మరొక నాయకుడు తమపై బురదజల్లడం హాస్యాస్పదంగా ఉందని కాంగ్రెస్ మండల నాయకుడు మసికే కుమారస్వామి అన్నారు. బుధవారం ఆయన చెరువు కట్టను పరి శీలించిన అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుల రాజకీయ ఎదుగుదలను ఓర్వలేకనే అర్థంపర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని, తాటాకు చప్పుళ్లకు బయపడేవాళ్ళు లేరని అన్నారు . చిల్లర రాజకీయాలు మానుకోకపోతే రెట్టింపుగా తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. విలువలతో కూడిన రాజకీయం చేయాలని హితవు పలికారు.చలివాగు పరివాహక ప్రాంతంలో దళితుల భూములను అక్రమంగా కాజేసి, దున్నుకుంటున్న హీన చరిత్ర మీదని మండిపడ్డారు. మైలారం దళిత బీఆర్ఎస్ నాయకులు వారి చేతిలో కీలుబొమ్మలుగా మారొద్దని మీకు చిత్తశుద్ధి ఉంటే గ్రామంలో ఏ పార్టీ నాయకులు దళిత భూములు ఆక్రమించిన వాటిని వెనక్కి తీసి దళితులకు పంచిపెట్టడానికి మేము సిద్ధం మీరు కూడా సిద్ధమా అని సవాలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో పథకాల కోసం వసూళ్లకు పాల్పడిన నాయకులు మీరా మాకు చెప్పేది అని ధ్వజమెత్తారు. తొందర్లోనే మీ అవినీతి రాజకీయం గుట్టు బయట పడతాయి అన్నారు . చెరువు కట్ట పనులు అడ్డుకున్నామని చేసే ప్రచారం అవాస్తవమని, ఏ నక్ష ప్రకారం పనులు చేసిన తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నాయకులుగా ప్రజా సమస్యలపై గొంతెత్తితే స్వాగతిస్తామని, చిల్లర రాజకీయాలు మానుకోకపోతే తరిమికొడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మామిడిపల్లి సాంబయ్య, ఏనుగుల అశోక్, అరికెళ్ల సుధాకర్, మోత వెంకటేశ్వర్లు ,జక్కుల సంపత్, పల్లెబోయిన రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్కతుర్తి ఏఎంసీ బాధ్యతల స్వీకరణ

**వేద న్యూస్, ఎల్కతుర్తి:**

ఎల్కతుర్తి ఏఎంసీ(అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ) చైర్మన్‌గా కాంగ్రెస్ సీనియర్ నేత, ఆ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు సుకినె సంతాజీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎల్కతుర్తి మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట ఆఫీసులో ఆయనతో పాటు వైస్ చైర్మన్‌గా బొక్కల స్రవంతి శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు జి కొమురయ్య, ఎం జగన్, షేక్ హక్కీం పాషా, జే వెంకటస్వామి, ఆర్ మొండయ్య, జి రాజయ్య, దాట్ల ప్రవీణ్, ఎం రాజయ్య, బండి సుధాకర్‌లూ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గానికి కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

**ఏఎంసీ తొలి చైర్మన్‌గా విధేయుడికి అవకాశం**

ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ తొలి చైర్మన్‌గా కాంగ్రెస్ నేత సుకినె సంతాజీని నియమించడం పట్ల కాంగ్రెస్ శ్రేణుల హర్షం వ్యక్తం చేశాయి. నేతలు, కార్యకర్తలు స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం సుకినె సంతాజీకి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. పలువురు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి.. స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన చైర్మన్ గిరిలో ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ పరిధిలో రైతాంగానికి మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

స్థానిక మంత్రి పొన్నం ప్రభాకార్ సహకారంతో రైతులకు మేలు చేసే దిశగా అడుగులు బలంగా ఆయన వేస్తారని కాంగ్రెస్ శ్రేణులు ధీమా వ్యక్తం చేశాయి.

# తెలుగు సాహిత్య ఔన్నత్యం చాటిన జ్ఞానపీఠ పురస్కార గ్రహీతలు

**వేద న్యూస్, హైదరాబాద్:**



భారతీయ సాహిత్య ఔన్నత్యాన్ని జ్ఞానపీఠ పురస్కార గ్రహీతలు ప్రపంచానికి చాటిచెప్పారని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు అన్నారు. విశ్వనాథ సాహిత్య పీఠం, ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు శాఖ సంయుక్తంగా నిర్వహించిన 'జ్ఞానపీఠ పురస్కార గ్రహీతల సాహిత్య సదస్సు'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశ్వనాథ సత్యనారాయణ, డా.సి.నారాయణరెడ్డి, రావూరి భరద్వాజల సాహిత్య కృషిని గురించి ప్రత్యేకంగా సదస్సు నిర్వహించటం అరుదైన విషయమని తెలుగు శాఖని అభినందించారు. తెలుగులో విశ్వనాథ సత్యనారాయణ ఒక సాహిత్య శిఖరమని, విభిన్న భాషాలలో ఆయనకు పాండిత్యముందని, తెలుగు గేయ సాహిత్యవికాసానికి డా.సి.నారాయణరెడ్డి ఎంతో కృషి చేశారని, పేదరికంలో పుట్టి స్వయంశక్తితో గొప్ప సాహితీ వేత్తగా ఎదిగారని అన్నారు. డిగ్రీ కాలేజీలో చదువుతున్నప్పటికీ మేరు నగధీరులైన సాహితీ మూర్తుల గురించి విద్యార్థులు కూడా పత్ర సమర్పణ చేయడం విశేషమని ప్రశంసించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ మాట్లాడుతూ పాఠ్యాంశాల బొధనకే పరిమితం కాకుండా తెలుగు సాహిత్య రంగంలో విశేషంగా కృషి చేసిన కవులు, రచయితల గురించి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్న తెలుగు శాఖను అభినందించారు. సదస్సులో విశిష్ట అతిథిగా పాల్గొన్న డా.వెల్చాల కొండల రావు మాట్లాడుతూ తాను స్థాపించిన విశ్వనాథ సాహిత్య పీఠం ద్వారా ఎన్నో వ్యయప్రయాసల కోర్చి కవిసమ్రాట్ రచనలను పునర్ముద్రించి పాఠకులకు అందిస్తున్నామన్నారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన విశ్వనాథ మనవడు కళాపూర్ణ శోభనాద్రి మాట్లాడుతూ చారిత్రాత్మక సిటీ కళాశాలలో విశ్వనాథ సాహిత్యంపై ఒక సాంకేతిక సదస్సు నిర్వహించటం ఎంతో స్ఫూర్తిదాయకమని, సదస్సు కన్వీనర్ శ్రీమతి అవధానం సుజాతని అభినందించారు.

తెలంగాణ విశ్వవిద్యాలయ ఆచార్యుడు లక్ష్మణ చక్రవర్తి, విశ్వనాథ విద్యా దృక్పథం గురించి మాట్లాడుతూ ఈనాటి పరీక్ష విధానానికి, మూల్యాంకన రీతికి, పర్యావరణ అభివృద్ధికి అవసరమైన ఎన్నో విలువైన విషయాలను ఆనాడే విశ్వనాథ చాటి చెప్పారని అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు ఆచార్యులు దార్ల వేంకటేశ్వర రావు మాట్లాడుతూ అనేక వైజ్ఞానిక, తాత్విక, శాస్త్రీయ అంశాలను సినారె తన విశ్వంభర కావ్యంలో చర్చించారని అన్నారు. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులు ఎన్.రజని రావూరి భరద్వాజ సాహిత్య కృషిని గురించి వారి జ్ఞానపీఠ పురస్కార నవల పాకుడురాళ్ళు గురించి విశ్లేషించారు. సదస్సు కన్వీనర్ తెలుగు శాఖ సహాయ ఆచార్యులు అవధానం సుజాత స్వాగతం పలుకుతూ సదస్సు లక్ష్యాలను తెలియజేశారు. సాంకేతిక సమావేశాలను డా.పి.కమల సుధారాణి, ఆచార్య కాకునూరు సూర్యనారాయణమూర్తి ఆధ్యక్షం వహించారు. ఈ సదస్సులో వైస్ ప్రిన్సిపాల్ డా.శాంతి, తెలుగు విభాగం అధ్యక్షులు డా.కోయి కోటేశ్వర రావు, అధ్యాపకులు డా.సుజాత అజ్మీర, డా.జె.నీరజ, వివిధ విభాగాల ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్మీ శక్తిపై క్యాడెట్స్ కు వివరణ

- **9వ రోజు ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ క్యాంప్**
- **ఆకట్టుకున్న ఆర్మీ యుద్ధ విన్యాసాలు**
- **సెక్షన్ ఫార్మేషన్ ప్రారంభించిన క్యాంప్ డిప్యూటీ కమాండర్**




**వేద న్యూస్, వరంగల్:**

మామునూరు పోలీసు శిక్షణ కళాశాలలో జాతీయ సమైక్యత శిబిరం ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ 12 రోజుల క్యాంపులో 9వ రోజు.. బుధవారం ఆపరేషన్ సిందూర్, సెక్షన్ ఫార్మేషన్ గురించి వివరించడంతో పాటు యోగ ఆసనాలపై పేర్కొన్నట్టు క్యాంప్ డిప్యూటీ కమాండెంట్ కల్నల్ ఎస్ఎస్ రామదురై తెలిపారు. ఈ క్యాంపు కమాండెంట్ గా కల్నల్ సచిన్ అన్నారావ్ నెంబర్కర్, వీర్ చక్ర వరంగల్ గ్రూప్ కమాండర్ ఆధ్వర్యంలో కొనసా గుతున్న క్యాంపులో భారత దేశ ఆర్మీ, యుద్ధ విన్యాసాలు ,మామునూరు పోలీస్ శిక్షణ కళాశాల పరేడ్ గ్రౌండ్లో విన్యాసాలు చేసి అందర్నీ అబ్బురపరిచారు. దేశ రక్షణలో ఆర్మీ సరిహద్దు ప్రాంతంలో యుద్ధ క్షేత్రంలో చేపట్టే ఆపరేషన్ సింధూర్ విధంగా విన్యాసాలు చేసి.. టెర్రరిస్టుల పోస్టులను గుర్తించి ఆర్మీకి నష్టం జరగకుండా కఠోరమైన యుద్ధ విన్యాసాలు చేసి.. బీహార్, జార?ండ్, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ డైరెక్టర్ 600 మంది క్యాడేట్స్ కు మనోధైర్యాన్ని నింపారు. సెక్షన్ ఫార్మేషన్ ను క్యాంప్ డిప్యూటీ కమాండర్ కల్నల్ ఎస్ఎస్ రామదూర ప్రారంభించి.. ఆర్మీ శక్తి సామర్థ్యాల గురించి వివరించారు. ఆర్మీ ఆపరేషన్ సింధూర్ భారత దేశ యుద్ధాలు ,యుద్ధంలో వీరులుగా నిలిచిన ఆర్మీ చరిత్రను లెఫ్టినెంట్ కల్నల్ రవి సునారే ఆడిటోరియంలో వివరించారు. ఈ కార్యక్రమంలో కల్నల్ లెఫ్టినెంట్ రవి సునారే ఆజ్యుడెంట్, కెప్టెన్ డాక్టర్ ఎం సదానందం ,ఫస్ట్ ఆఫీసర్ వెంకటేష్ గౌడ్, సుబేదారి మేజర్ జయరాం సింగ్, శిక్షణ జేసీవోలు అజిత్ కదం ,చౌరస్య, సందీప్పవర్, సుతారి పోస్ట్ ఆఫీసర్ గణేష్ రవి సంతోషి, కల్పన, కమల్ కిషోర్, రచన, అపురూప , సంధ్య ,కాత్యాయని ,అరుణ, కుమారస్వామి, నికిలేష్ ,ప్రవీణ్ ,దీపక్ ,దశరథం ,సతీష్ మహేశ్, రేపు డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ సంస్కృతిక, జాతీయ సమైక్యత వివిధ రాష్ట్రాల డైరెక్టరేట్ల ప్రదర్శనలో పాల్గొని ప్రతిభ కనబరిచిన వారికి బహుమతుల ప్రదానం ఉంటుందని ఎస్ఎస్ రాముదురై వెల్లడించారు.

# కురిక్యాల సొసైటీ వద్ద కుప్పకూలిన రైతు

**– యూరియా కోసం రైతుల పడిగాపులు**

**వేద న్యూస్, గంగాధర :**



కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాల గ్రామ సొసైటీ వద్ద యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెల్లవారుజామునే వచ్చి బస్తాల కోసం కాపులు కాస్తున్న రైతులు సాయంత్రం వరకు సరఫరా అందక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తుంటే యూరియా అందక నష్టపోతున్నామని వాపోయారు. ఉదయం 5 గంటల నుంచే సొసైటీ వద్ద కాపులు కాస్తున్నా యూరియా అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం కురిక్యాల గ్రామానికి చెందిన రైతు సాయిల్ల రాజమల్లు చాలా సమయం సేపు నిలబడి ఉండడంతో అస్వస్థతకు గురై కిందపడ్డాడు. స్థానికులు అతన్ని వెంటనే ఆర్.ఎం.పి వద్దకు తరలించగా, మెరుగైన చికిత్స అవసరమని వైద్యులు సూచించారు. అనంతరం కరీంనగర్‌కు తరలించారు. రైతులు ప్రభుత్వాన్ని, అధికారులను ప్రశ్నిస్తూ యూరియా సరఫరా లోపం వెంటనే పరిష్కరించాలని, లేకుంటే పంటలు పూర్తిగా నష్టపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073